https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 55 శనివారం 27-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## ‘రైతు భరోసా’లో

# కొత్త రైతులు..!

**ఈ నెల 15 నాటికి పాస్‌పుస్తకం వచ్చినవారికే**

**జూలై 5 వరకు లబ్ధిదారుల నమోదుకు అవకాశం**

**పథకం కోసం నిధులు సమీకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**బహిరంగ మార్కెట్ నుంచి రూ.7 వేల కోట్ల రుణం**

**ఈ నెల 30న రైతుల ఖాతాలకు నగదు బదిలీ**



**హైదరాబాద్, జూన్ 26**

రైతు భరోసా పథకంలో కొత్త రైతులు చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటివరకు ఈ పథకంలో నమోదు చేసుకోని రైతులు, కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు.. సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి, తమ పేర్లు నమోదు చేసుకునేందుకు గడువు తేదీలు ప్రకటించింది. ఈ నెల (జూన్) 15వ తేదీ నాటికి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు.. రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హులైన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)కి గానీ, మండల వ్యవసాయ అధికారి (ఎంఏవో)కి గానీ దరఖాస్తులు, ధ్రువపత్రాలు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దరఖాస్తుతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్సు కాపీలతోపాటు రైతుభరోసా దరఖాస్తు ఫారాలను సమర్పించాలని పేర్కొంది. దరఖాస్తులు, ధ్రువపత్రాలు సమర్పించేందుకు జూలై 5 చివరి తేదీగా ప్రకటించింది. కాగా వ్యవసాయశాఖ అధికారులు సీసీఎల్ఏ డేటా ఆధారంగా దరఖాస్తులు తీసుకొని.. రైతుభరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే లబ్ధిదారుల జాబితాలో కొత్త రైతులు చేరిపోతారు. రైతుభరోసా పథకానికి ప్రభుత్వం నిధులు సమీకరిస్తోంది. 30న రైతుల ఖాతాల్లో రైతుభరోసా పెట్టుబడి సాయం జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో నిర్వహించే బహిరంగసభలో ఈ నిధులను సీఎం విడుదల చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ నుంచి ఒకేసారి 7 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.1000 కోట్లు, 18 ఏళ్ల కాలపరిమితితో రూ.2 వేల కోట్లు, 23 ఏళ్ల కాలపరిమితితో రూ.2 వేల కోట్లు, 29 ఏళ్ల కాల పరిమితితో రూ.2 వేల కోట్ల చొప్పున ప్రభుత్వం రుణంతీసుకోనుంది. ఈ నిధులు ఈ నెల 30న ప్రభుత్వ ఖజానాలో జమ కానున్నాయి. వీటిని రైతుభరోసా పథకానికి ప్రభుత్వం వినియోగించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 73 లక్షల మంది పట్టాదారులు ఉన్నారు.

మిగతా 2లో...

## మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై

# కొనసాగుతున్న ఉత్కంఠ



**న్యూఢిల్లీ, జూన్ 26:**

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఉత్కంఠ కొనసాగుతోంది. జూన్ 28 లేదా జూన్ 29వ తేదీన కేంద్ర మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ముతో మంత్రివర్గ విస్తరణకు అనుకూలమైన తేదీలపై ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. కొత్త మంత్రివర్గంలోకి ఆర్బీఐ మాజీ గవర్నర్, ప్రధాని ముఖ్య కార్యదర్శి శక్తి కాంత దాస్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కే అవకాశం ఉందని సమాచారం. అలాగే ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శాఖ మారుస్తారనే ప్రచారం సాగుతోంది. ఆమెకు విద్యాశాఖ కేటాయిస్తారనే చర్చ నడుస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటారు. ఎన్డీఏకు మద్దతు ఇచ్చిన శివసేనకు ఈ మంత్రివర్గంలో చోటు లభించే అవకాశం ఉంది. ఆ పార్టీ ఎంపీ శ్రీకాంత్ షిండేకు మంత్రి పదవి లభించనుంది. కొత్త మంత్రుల జాబితాలో ఎంపీలు అరుణ్ గోవిల్, విష్ణుదత్ శర్మ, జనార్దన్ సింగ్ సిగ్రీవాల్ పేర్లు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం ప్రస్తుత ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పంజాబ్‌లో పార్టీ బలోపేతం కోసం రవ్‌నీత్ బిట్టు స్థానంలో తరుణ్ చుగ్‌కు స్థానం కల్పించనున్నారు. కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాదవ్‌తోపాటు మనోహర్ లాల్ ఖట్టర్ శాఖలు మార్చే అవకాశం ఉంది. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, హర్దీప్ సింగ్ పూరీతోపాటు అరడజను మంది సహాయ మంత్రులను మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం కొనసాగుతోంది.

# చల్లారుతున్న చమురు మంట

**- 70 డాలర్లకు బ్యారల్ ధర - మార్కెట్లో మళ్లీ ఇరాన్ క్రూడ్**

**- మున్ముందు సెగ మరింత తగ్గే అవకాశం**

2

## మూసీ రివర్ బెడ్ నిర్వాసితులకు

# ‘డబుల్’ ఇళ్లు!

**నెక్లెస్ రోడ్డులో మూసీ ప్రాజెక్టు నమూనా**

**భూసేకరణకు.. పరిహారం లేదా టీడీఆర్**

**నిర్వాసితులే ఎంచుకోవాలి**

**మూసీ మొదటి దశ ప్రాజెక్టుపై సమీక్షలో సీఎం రేవంత్**



**హైదరాబాద్, జూన్ 26**

మూసీ రివర్ బెడ్‌లో ఉన్నవారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికా రులను ఆదేశించారు. మూసీ మొదటి దశ ప్రాజెక్టుపై శుక్రవారం ఎంసీహెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయ్య?షరంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ ఎండీ నర్సింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, పురపాలకశాఖ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. భూ్రసకరణ కోసం ఆసక్తి ఉన్న వాళ్లకు టీడీఆర్ ఇవ్వాలని, లేకపోతే నష్ట పరిహారం చెల్లించాలని సూచించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న డిఫెన్స్ భూముల్లో ఉన్న నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# అయ్యో రామా!

## అయోధ్య ఆలయంలో దొంగలు పడ్డారు

**కెమెరాల కళ్లుగప్పి కోట్లు కొల్లగొట్టారు**

**దోచుకున్న సొమ్ము టాయ్‌లెట్లలో దాచారు!**

**కౌంటింగ్ గదిలోనే సిబ్బంది చౌర్యం**

**అక్రమాలు తెలిసినా పట్టించుకోని ట్రస్టు**

**ప్రధాన కార్యదర్శి రాయ్ సన్నిహితుడు టిన్నూ**

**కీలక సూత్రధారి.. సిట్ నివేదికలో వెల్లడి**

**8 మంది అరెస్ట్.. రూ.79 లక్షలు స్వాధీనం**

**ట్రస్టుకు రాయ్, మిశ్రా రాజీనామా**



**లఖ్‌నవూ, జూన్ 26:**

అయోధ్య రాముడి హుండీకే కన్నం వేశారు. రామ భక్తులు భక్తితో సమర్పించుకున్న సొమ్ములను కాజేశారు. ‘ఇంటి దొంగలు’ విచ్చలవిడిగా రెచ్చిపోయారు. అయోధ్య రామాలయానికి ఇచ్చిన నగలు, వెండి ఇటుకలు, భూరి విరాళాల మాయంపై ఇప్పటికే పలు ఆరోపణలు వెలువడుతుండగా.. ఆలయంలోనే జరిగిన హుండీ, విరాళాల సొమ్ము స్వాహా సంగతులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బయటపెట్టింది. శ్రీరామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు అత్యంత సన్నిహితుడైన టిన్నూ యాదవ్ ఇందులో కీలక సూత్రధారి అని తేల్చింది. అతడితో పాటు 8 మందిని గురువారం రాత్రి అరెస్టుచేసి.. శుక్రవారం కోర్టు ముందు హాజరుపరచింది. ‘సిట్’ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రామాలయంలో విరాళాల లెక్కింపు గదిలోనే సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. ఎవరూ గమనించకుండా హుండీల నుంచి నగదు మాయం చేశారు. అలా దోచుకున్న డబ్బును టాయ్‌లెట్లలో దాచిపెట్టి, ఆ తర్వాత వీలు చూసుకుని తమతోపాటు తీసుకెళ్లి పంచుకునేవారు. ఇంకా... విరాళాల సొమ్ము వంద నోట్ల చొప్పున కట్టలుగా కట్టిన తర్వాత... ప్రతి కట్టలో అదనంగా మరిన్ని నోట్లు కుక్కేవారు. బ్యాంకుకు తీసుకెళ్లేటప్పుడు ఆ కట్టల నుంచి అదనపు నోట్లు తీసేసుకునేవారు. ఈ క్రమంలో సీసీ కెమెరాల కళ్లూ కప్పారు. ఒక ఉద్యోగి సీసీటీవీ కెమెరాకు అడ్డంగా నిలబడేవాడు. అదే సమయంలో మరో ఉద్యోగి నోట్ల కట్టల నుంచి డబ్బు మాయం చేసేవాడు.

మిగతా 2లో...

# రాష్ట్ర బీజేపీకి అధిష్ఠానం చికిత్స!

**- రేపు రాష్ట్రానికి పార్టీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్**

**- అంతర్గత సమస్యలు, పని చేయని నేతలపై నజర్**

**- 4 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలపై దిశానిర్దేశం**

మిగతా 2లో...



**హైదరాబాద్, జూన్ 26**

తెలంగాణలో అధికారంలోకి రావటమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ.. అందుకు క్రమంగా కార్యాచరణ మొదలు పెడుతోంది. ప్రధాని మోదీ ఇటీవలే రాష్ట్ర పర్యటనకు వచ్చి వెళ్లగా.. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదివారం రాష్ట్రానికి రానున్నారు. పార్టీ బలోపేతం, నాయకుల మధ్య సమన్వయం పెంచటం, త్వరలో జరిగే నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన మూడు రోజులపాటు రాష్ట్ర నేతలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా

# సంజయ్ జాజు

**పరిశ్రమలు, ఐటీ శాఖల స్పెషల్ సీఎస్‌గా అదనపు బాధ్యతలు.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**సంజయ్ వైపే మొగ్గు చూపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**కేంద్రం, ఉమ్మడి ఏపీ, తెలంగాణలో జాజు కీలక బాధ్యతలు**

**సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్‌గా రామకృష్ణారావును నియమించిన ప్రభుత్వం**



**హైదరాబాద్, జూన్ 26**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. సంజయ్ 1992 బ్యాచ్ అధికారి. ఇదే బ్యాచ్‌కు చెందిన మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లు జయేశ్ రంజన్, వికాస్ రాజ్‌ల నుంచి పోటీ ఎదురైనప్పటికీ. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సంజయ్ వైపే మొగ్గు చూపారు. ఇటీవల ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సంజయ్.. తాను సీఎస్‌గా రావడానికి ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. దీంతో రేవంత్ ఆయనకే సీఎస్ పదవి కట్టబెట్టారు. ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30తోముగియనుంది. ఆయన స్థానంలో సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయనకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, పరిశ్రమల పెట్టుబడుల విభాగం సీఈవోగా, ‘స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ (స్పీడ్)’ సీఈవోగా అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన సంజయ్ జాజు సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్. ఆయన 1969 ఫిబ్రవరి 26న జన్మించారు. బీఈ మెకానికల్, ఎంటెక్ పూర్తి చేశారు.

మిగతా 2లో...

## 30న రాష్ట్రవ్యాప్తంగా

# కాలేజీల బంద్

**హైదరాబాద్, జూన్ 26**

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పాత బకాయిలు రూ.8 వేల కోట్లను విడుదల చేయాలన్న డిమాండ్లతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్ చేపట్టనున్నట్లు ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. అలాగే అదే రోజున కలెక్టరేట్, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన 14 బీసీ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతోందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ దుయ్యబట్టారు. ప్రభుత్వ బీసీ వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్ చేపడుతున్నట్లు ప్రకటించారు. అలాగే జూలై 15న సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు ‘చలో హైదరాబాద్’ విద్యార్థి మార్చ్ నిర్వహించి, బడుగు విద్యార్థుల సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు. బీసీ భవన్‌లో నిర్వహించిన బీసీ విద్యార్థి, యువజన సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో జాజుల మాట్లాడారు.

# చల్లారుతున్న చమురు మంట

**70 డాలర్లకు బ్యారల్ ధర**

**మార్కెట్లో మళ్లీ ఇరాన్ క్రూడ్**

**ముమ్ముందు సెగ మరింత తగ్గే అవకాశం**

**దేశ ఆర్థిక వ్యవస్థకూ ఉపశమనం**



**న్యూఢిల్లీ:**
పెరుగట విరుగుట కొరకే అనే సామెత ముడి చమురు ధర విషయంలో మరోసారి రుజువవుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడితో చుక్కలంటిన ముడి చమురు ధర ప్రస్తుతం నేలచూపులు చూస్తోంది. శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్ బ్రెంట్ రకం ముడి చమురు ధర 70 డాలర్లకు దిగి వచ్చింది. ఒక దశలో ఇది 69 డాలర్లకు చేరి ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇది ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనపుడు ఉన్న ధర కంటే తక్కువ. తీవ్ర బేరసారాల తర్వాత ఎట్టకేలకు అమెరికా–ఇరాన్ మధ్య 60 రోజుల శాంతి ఒప్పందం కుదిరింది. దీంతో ఇరాన్ కూడా తన వద్ద భారీగా పేరుకుపోయిన చమురును ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతోంది. ఇరాన్ పెట్రోలియం శాఖ మంత్రి ఇందుకోసం ఇటీవలే మన దేశానికి వచ్చి వెళ్లారు. పశ్చిమాసియాలోని ఇతర దేశాలతో పోలిస్తే బ్యారల్‌కు 3 నుంచి 4 డాలర్ల డిస్కౌంట్‌తో భారత్‌కు చమురు సరఫరా చేసేందుకు సిద్ధమని ఈ పర్యటనలో ఆయన భారత్‌కు ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు యుద్ధం చల్లారడంతో ఇతర గల్ఫ్ దేశాలూ భారీగా చమురు ఎగుమతులకు సిద్ధమయ్యాయి. దీంతో త్వరలోనే బ్యారల్ చమురు ధర 60 నుంచి 65 డాలర్లకు దిగి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

**వృద్ధికి ఊతం**
ఈ యుద్ధంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలు 6.5 శాతానికి కుదించేశాయి. ఇప్పుడు యుద్ధం చల్లారడంతో అంతర్జాతీయ ఇనట?్వస్టమెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్.. భారత జీడీపీ వృద్ధి రేటును 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది. రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలనీ 4.6 శాతం నుంచి 4.4 శాతానికి కుదించింది. కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) జీడీపీలో 1.1 శాతం మించక పోవచ్చని తెలిపింది.

**స్టాక్ మార్కెట్, రూపాయికీ మంచిదే**
పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారత స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో ఇప్పుడు మళ్లీ గాడిన పడుతోంది. నిన్న మొన్నటి వరకు అమ్మకాలతో మార్కెట్‌ను కుదిపేసిన విదేశీ పోర్టుఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులకు దిగారు. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం శాశ్వత ఒప్పందానికి దారితీస్తే నిఫ్టీ త్వరలోనే 25,000 పాయింట్ల మార్క్‌ను అధిగమించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. స్టాక్ మార్కెట్ గాడిన పడడంతో నిన్న మొన్నటి వరకు డాలర్‌తో 'బేర్'మన్న రూపాయి మారకం రేటూ కోలుకుంటోంది. యుద్ధ సమయంలో ఒక దశలో డాలర్‌తో రూ.97 వరకు పడిపోయిన రూపాయి మారకం రేటు ప్రస్తుతం రూ.94.34 పైసలకు అటుఇటుగా ట్రేడవుతోంది. ఇది మరింత బలపడి త్వరలోనే రూ.94 వద్ద స్థిరపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ఆటంకాలు**
అమెరికా–ఇరాన్ మధ్య ప్రస్తుతం కుదిరింది తాత్కాలిక సంధి మాత్రమే. రెండు నెలల్లోగా తుది ఒప్పందం కుదరకపోతే మళ్లీ యుద్ధం ప్రారంభమై హోర్ముజ్ జలసంధి మూసుకుపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే మళ్లీ చమురు సెగ తప్పదు. ఈ ఆటంకాలు ఏవీ లేకపోతే అధిక ధరల వద్ద కొన్న చమురు నిల్వలు మరో రెండు మూడు నెలల్లో అయిపోయి.. ఆయిల్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**భారత్‌కు ఊరట**
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేయనుంది. మన దేశ చమురు అవసరాల్లో దాదాపు 90 శాతానికి దిగుమతులే దిక్కు. ఈ దిగుమతుల్లో దాదాపు సగం గల్ఫ్ దేశాల నుంచే వస్తోంది. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి మూసుకుపోవడంతో ఒక దశలో బ్యారల్ చమురు ధర 129 డాలర్లకు ఎగబాకింది. అంత ధర పెట్టినా సరఫరా ఆటంకాలు ఏర్పడి దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌లకు కొరత ఏర్పడి ధరలు పెంచాల్సి వచ్చింది. ఇప్పుడు యుద్ధం చల్లారటంతో మన ఆర్థిక వ్యవస్థ ఊపిరి పీల్చుకుంటోంది.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా.. (మొదటిపేజీ తరువాయి)

1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్.. రాష్ట్ర సీఎసగా రెండేళ్ల ఎనిమిది నెలల పాటు పనిచేయనున్నారు. నిజానికి రాష్ట్ర క్యాడర్‌లో ఈయన కంటే మరో ఇద్దరు సీనియర్లు ఉన్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన శశాంక్ గోయెల్ ప్రస్తుతం ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఆయన సెప్టెంబరులో పదవీ విరమణ చేయనున్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన అర్వింద్‌కుమార్‌ను ప్రభుత్వం పక్కన పెట్టింది. మరోవైపు 1992 బ్యాచ్‌కే చెందిన జయేశ్ రంజన్ 15 నెలల తర్వాత, వికాస్ రాజ్ 22 నెలల తర్వాత రిటైర్ కానున్నారు. వీరికంటే సంజయ్ జాజుకు రిటైర్మెంట్ గడువు ఎక్కువగా ఉండడంతో ఆయనకే అవకాశమిచ్చినట్లు తెలుస్తోంది.

**'మీ-సేవా' రూపకర్త**
సంజయ్ జాజు 34 ఏళ్ల పాటు అటు కేంద్ర ప్రభుత్వంలో, ఇటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మొన్నటి వరకు కేంద్రంలోని ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా సేవలందించిన ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం రిలీవ్ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ముఖ్యకార్యదర్శిగా 2011 నుంచి 2014 వరకు సేవలందించారు. అప్పుడే ఐటీ రంగంలో పలు వినూత్న ఆవిష్కరణలకు రూపమిచ్చారు. సామాన్య ప్రజలకు బాగా చేరువైన 'మీ–సేవ' ప్రాజెక్టును రూపొందించింది ఆయనే. ఉమ్మడి ఏపీలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విశాఖపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గానూ సేవలందించారు. కేంద్ర సర్వీసుల్లో.. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖలోని నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌ఐడీసీఎల్) వ్యవస్థాపక డైరెక్టర్‌గా సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేశారు. సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు.

**సలహాదారుగా రామకృష్ణారావు**
ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న సీఎస్ కె.రామకృష్ణారావును ముఖ్యమంత్రికి సలహాదారుగా, ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును 2025 ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఆయన అదే ఏడాది ఆగస్టు 31న రిటైర్ కావాల్సి ఉంది. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఆయన సర్వీసును మరో 7 నెలలు పొడిగించింది. అంటే, ఈ ఏడాది మార్చి 31న బాధ్యతల నుంచి వైదొలగాల్సి ఉంది. సీఎం మరో 3 నెలల పాటు పొడిగించాలని కోరడంతో కేంద్రం ఈ నెల 30 వరకు పదవీ కాలాన్ని పొడిగించింది. దీంతో ఆయన 30న రిటైర్ కానున్నారు.

## అయ్యో రామా!.. (మొదటిపేజీ తరువాయి)

సీసీటీవీ ఫుటేజ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచి ఈ నెల 5వ తేదీ మధ్య కనీసం 70 దొంగతనాలు జరిగినట్లు పసిగట్టింది. నిందితులు టిన్నూ యాదవ్, సుభాష్ శ్రీవాస్తవలను విచారిస్తుండగా.. పలువురు బ్యాంకు అధికారుల పేర్లు కూడా బయటకు వచ్చాయి. రూ.7.5 కోట్ల వరకు డబ్బు తస్కరణకు గురైనట్లు చెబుతున్నా.. దొంగిలించిన సొమ్ము చాలా ఎక్కువే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అరెస్టయిన 8 మందిలో చంపత్ రాయ్ సన్నిహితుడు రాంశంకర్ 'టిన్నూ' యాదవ్, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, అవినాశ్ శుక్లా, మనీశ్ యాదవ్, కరుణేశ్ పాండే, రాంశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ ఉన్నారు. దర్యాప్తు సందర్భంగా సిట్ వీరి నుంచి రూ.79.85 లక్షలు స్వాధీనం చేసుకుంది.

**సిఫారసులతో ఉద్యోగాలు..**
సిట్ కేసు నమోదుచేసిన 8 మందిలో ఆరుగురు ఆలయ సిబ్బందే. పైగా విరాళాల డబ్బు లెక్కించే బాధ్యత వారిదే. చంపత్‌రాయ్ సన్నిహితుడు టిన్నూ యాదవ్ నివాసంలో రూ.10 లక్షల నగదు దొరికింది. విరాళాలు లెక్కించేవారిలో అత్యధికులు సిఫారసులతో ఉద్యోగాలు సంపాదించినవారేనని తేలింది. చంపత్ రాయ్‌కు టిన్నూ యాదవ్ డ్రైవర్‌గానూ పనిచేశాడు. తన బంధువైన మనీశ్ యాదవ్‌కు ఉద్యోగం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే అనుకల్ప్ మిశ్రా తన బావమరిది లవ్‌కుశ్‌కు ఉద్యోగం ఇప్పించాడు. విరాళాల లెక్కింపులో ఆలయ అధికారులు, ట్రస్టు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సిట్ పేర్కొంది. లెక్కింపు సిబ్బంది ప్రతి రోజూ ఇంటికెళ్లేటప్పుడు వారిని తనిఖీ చేయడం లేదు. అలాగే దొంగిలించిన సొమ్మును అవినాశ్ శుక్లా నేరుగా తన బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు వెల్లడైంది. ఈ దొంగతనాలు విరాళాలకే పరిమితం కాలేదు. భక్తులు ఇచ్చిన నగలను సైతం నిందితులు మాయం చేశారు. వీటిలో చెవిరింగులు, ముక్కుపు డకలు, గాజులు, కాలిపట్టీలు కూడా ఉన్నాయి. ఈ మొత్తం కుట్ర వెనుక టిన్నూ యాదవ్, సుభాష్ శ్రీవాస్తవ కీలక పాత్రధారులని సిట్ తేల్చింది. విరా ళాల సొమ్ము మాయమవుతోందని తెలిసినా ఆలయ ట్రస్టు సమర్థ చర్యలు తీసుకోలేదని సిట్ పేర్కొన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాజా పరిణామాల నేపథ్యంలో శ్రీరామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు.

**పెద్దవాళ్లను రక్షిస్తున్నారు: అఖిలేశ్**
సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు అజయ్ రాయ్ సీఎం యోగి ప్రభుత్వంపై శుక్రవారం విరుచుకుపడ్డారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను రక్షించాక ఎఫ్‌ఐఆర్ నమోదుచేశారని అఖిలేశ్ ఆరోపించారు. సిట్ మాటున ఆధారాలన్నీ తొలగించారని.. పట్టుకోవలసిన పెద్దపెద్ద వాళ్లను వదిలేశారని 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. సిట్ నివేదికను ముందుగానే సిద్ధం చేసి.. దానికనుగుణంగా దర్యాప్తు చేసినట్లు కనబడుతోందన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో చిరుద్యోగుల పేర్లు మాత్రమే చేర్చారని.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న, ఆలయ నిర్మాణం, ట్రస్టు కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న చైర్మన్ నృపేంద్ర మిశ్రా, చంపత్ రాయ్, గోపాలరావు, అనిల్ మిశ్రాల పేర్లు మాత్రం లేవని ఆక్షేపించారు. కాగా.. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేవారెవరినీ ఉపేక్షించేది లేదని సీఎం యోగి తేల్చిచెప్పారు.

## రాష్ట్ర బీజేపీకి.. (మొదటిపేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి, వరంగల్ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సత్తా చాటేలా రాష్ట్ర నేతలకు దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నాయి. రాష్ట్ర బీజేపీలో కొంతమంది నాయకులు పెద్ద పదవుల్లో ఉన్నా.. క్రియాశీలంగా పనిచేయటం లేదని అధిష్ఠానానికి ఫిర్యాదులు వెళ్లాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కష్టపడుతున్నా, ఆయన బృందంలోని ఎక్కువ మంది సొంత పనులకే పరిమితమవుతున్నారన్న విషయం ఢిల్లీకి చేరింది. ఒకటిరెండు మోర్చాలు తప్ప.. జిల్లా పార్టీ అధ్యక్షులు కూడా ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న అభిప్రాయం క్యాడర్‌లో ఉంది. ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 15 రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాలకు కూడా కొందరు నేతలు హాజరు కాలేదు. అలాంటి నేతలందరికీ నితిన్ నబిన్ హెచ్చరికలు జారీచేయబోతు న్నారని కొందరు ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎ?సకు సమాన దూరం పాటించాలని హైకమాండ్ నిర్దేశించినా కొందరు పట్టించుకోలేదని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అధిష్ఠానానికి నివేదిక అందించినట్లు సమాచారం. ఈ అంశంపైనా నబిన్ దృష్టి పెట్టనున్నారని తెలిసింది. కాగా, రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలు శుక్రవారం అర్ఎస్ఎస్ సహ కార్యవాహ్ అరుణ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి, సంజయ్ సహా ముఖ్యనేతలు పాల్గొన్నట్లు సమాచారం.

## 'రైతు భరోసా'లో.. (మొదటిపేజీ తరువాయి)

నిరుడు ఖరీఫ్ సీజన్‌లో వీరికి ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేసి రికార్డు సృష్టించింది. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో వేసే అవకాశాలున్నాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. మొదటి రోజు ఒక ఎకరం వరకు భూ విస్తీర్ణం ఉన్న పట్టాదారులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించాలంటే రూ.900 కోట్ల నిధులు అవసరమవుతాయి. ఒకవేళ రెండెకరాల వరకు నగదు బదిలీ చేస్తే రూ.2,400 కోట్లు అవసరం పడతాయి. రోజుకో ఎకరం చొప్పున పెంచుకుంటూ.. 10 ఎకరాలకు మించి భూమి ఉన్న రైతులకు ఒకేసారి నగదు బదిలీ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ నెల 30న ప్రారంభిస్తే.. మధ్యలో జూలై 5న ఆదివారం వస్తోంది. ఆ రోజు మినహాయిస్తే.. 8 రోజుల్లోనే నగదు బదిలీ ప్రక్రియ పూర్తిచేయాలని వ్యవసాయశాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో మొత్తంగా కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించాలంటే రూ. 9 వేల కోట్లు అవసరమవుతాయి. రెండు పంటలకు కలిపి రూ.18 వేల కోట్లు అవుతాయి. అందుకే గత బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లను రైతుభరోసాకు ప్రభుత్వం కేటాయించింది. గడిచిన యాసంగి సీజన్‌లో రెండెకరాల వరకు మాత్రమే ప్రభుత్వం రైతుభరోసా చెల్లించింది. ఈ ఖర?ఫలో మాత్రం పూర్తిస్థాయిలో చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అప్పు తీసుకునే రూ.7 వేల కోట్లకు మరో రూ.2 వేల కోట్లు జోడించనుంది.

# ఆస్తి కోసం హత్య..

**భర్తను గొంతు నులిమి చంపిన భార్య**

**- సహకరించిన కూతురు, అల్లుడు**

**-తిమ్మాజిపేట మండలం ఆవంచలో వెలుగు చూసిన ఘటన**



**నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 26**
ఆస్తి కోసం కట్టుకున్న భర్తనే అల్లుడు, కూతురు సహకారంతో హత్య చేసింది. తర చూ గొడవ పడుతూ అమ్మపల్లి యాదయ్య (54)ను ఆయన భార్య అమ్మపల్లి అలివేలు, కూతురు బండారి పద్మ, అల్లుడు బండారి ఆంజనేయులు తలపై ఇనప రాడ్డుతో కొట్టి గొంతు నులిమి చంపేశారు. ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తు న్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ అశో క్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్ల డించారు. తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన అమ్మపల్లి యాదయ్య అలి వేలు దంపతులకు ఒకే ఒక కూతురు పద్మ ఉన్నా రు. పద్మకు గత 12ఏళ్ల క్రితం మిడ్జిల్ మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహమైంది. అత్త అలివేలు, అల్లుడుతో చ నువుగా మెలిగి ఉండేది. ఇదే అదునుగా అత్త తో అల్లుడు వివాహేతర సంబంధం కొనసా గించాడు. అత్తను మచ్చిక చేసుకున్న క్రమం లో అల్లుడు మామ యాదయ్య పేరున ఉన్న భూమి (ఒక ఎకరం 20గుంటలు)ని తన పే ర చేయాలని తరచూ ఒత్తిడి తెచ్చేవాడు. ఇదే క్రమంలో అలివేల కూడా భూమిని అల్లుడి పేరిట చేయమని భర్తను ఇబ్బందులకు గురి చేసేది. ఈ నెల 23న మధ్యాహ్నం సమయం లో యాదయ్య, అతని భార్య అలివేలు గొడ వపడ్డారు. ఈ విషయం కూతురు పద్మ అల్లు డు ఆంజనేయులుకు తెలియజేసింది. పథకం ప్రకారం యాదయ్యను హత్య చేస్తే రైతు బీమా ఐదు లక్షలు వస్తుందని, దీంతోపాటు భూమి కూడా అల్లుడు పేరున చేయవచ్చని వారిని ఫోన్ ద్వారా తెలిపింది. వారిని పిలి పించి యాదయ్యను గొంతు నుమిలి ఊపి రాడకుండా చేసి తలకు రాడ్డుతో కొట్టి చంపే శారు. తర్వాత కూతురు, అల్లుడు వారి సొం త గ్రామానికి వెళ్లిపోయారు. యాదయ్య అనా రోగ్యంతో మృతి చెందాడని భార్య అలివేలు బంధువులకు తెలిపింది. అంత్యక్రియల సమ యంలో మృతదేహానికి స్నానం చేయించడా నికి తీసుకెళ్లగా ఒంటిపై బలమైన గాయాలు కన్పించడంతో వారి సమీప బంధువైన గడ్డమీ ద పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చే శారు. ఈ సంఘటనలో కేసు నమోదు చేసిన తిమ్మాజిపేట పోలీసులు విచారణ జరిపారు. మృతుడి భార్య, కూతురు, అల్లుడు హత్య చే సినట్లు ఒప్పుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది గత టీఆర్ఎస్ ప్రభుత్వమే

**అభివృద్ధిపై అవగాహన లేని ఎమ్మెల్యే సంజయ్**


**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, జూన్ 26**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ను అప్పుల ఊబిలోకి నెట్టింది గతంలో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ టిఆర్ఎస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్ లో మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి లతో కలిసి జువ్వాడి కృష్ణారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కంటే ముందు పరిపాలించిన ముఖ్యమంత్రులందరు అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి ఉత్పదక రంగంలో పెట్టుబడి పెట్టారని కేవలం 69 వేల కోట్ల రూపాయలు మాత్రమే కానీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి ఎన్ని లక్షలు కోట్ల రూపాయల అప్పు చేసింది తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజానీకాన్ని ప్రభుత్వాని కల్వకుంట్ల కుటుంబం దోచుకొని వారి సొంత ఆస్తులు పెంచుకున్నారన్నారు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అవగాహనాలు ఏమిటో రాష్ట్ర ప్రభుత్వము పై దుష్ప్రచారం చేయాలని చెడు ఉద్దేశంతో మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం కరెంటు లేని రాష్ట్రంగా తాగునీరు లేని రాష్ట్రం సాగునీరు లేని రాష్ట్రం గురుకులాలు లేని రాష్ట్రం తెలంగాణ మెడికల్ కాలేజీలు లేని రాష్ట్రం తెలంగాణ అని గత పాలకులు 65 సంవత్సరాలు పాలించి తెలంగాణ రాష్ట్రాన్ని దరిద్రపు తెలంగాణగా మార్చాలని మాట్లాడడం హాస్యాస్పదమని అవగాహన లేని అసమర్థ ఎమ్మెల్యే కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రామగుండంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రం తో పాటు ఏడు రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసిన విషయం కల్వకుంట్ల సంజయ్ కి అవగాహన ఉండదని ఆయన తెలుసుకోలేడు 2004 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి ఉచిత విద్యుత్ ఫైల్ పై అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం చేసిన విషయం యావత్ తెలంగాణ ప్రజలందరికీ తెలుసు అన్నారు రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అసలు కరెంటు లేదని రాష్ట్రంలో అని చెప్పడం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ విషయపరిజ్ఞానం లేదన్నారు. దానితోపాటు సాగునీటి విషయాన్ని తీసుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం హాయంలో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మించింది 1977 ప్రాంతంలోని కోరుట్ల మెట్పల్లి నియోజకవర్గానికి సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్నిదని ఈ విషయం అజ్ఞాని అయిన సంజయ్ కి తెలవదు అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో వ్యవసాయ భూములను కాకతీయ కెనాల్ ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సస్యశ్యామలంగా చేసిందన్నారు. దానితోపాటు తాగునీటి విషయానికొస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ఏర్పాటు చేసి గ్రామ బ్రాహ్మణ ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ఇంటింటికి మంచినీరు సరఫరా చేస్తుండగా టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో డబ్బులు దండుకోవాలనే ఉద్దేశంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నిర్మించినటువంటి మంచినీటి ట్యాంకులను మిషన్ భగీరథ పేరు చెప్పి రంగులు వేసి వేలాది కోట్ల రూపాయలు కల్వకుంట్ల కుటుంబం దండుకుందన్నారు గురుకులాల విషయానికి వస్తే భారత ప్రభుత్వం ఇందిరా గాంధీ నాయకత్వంలో పీవీ నరసింహారావు మానవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని అదే మాదిరిగా 1983 సంవత్సరంలోనే కోరుట్ల నియోజకవర్గంలోని పెద్దాపూర్ లో బాలుర గురుకుల విద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు కల్వకుంట్ల సంజయ్ డాక్టర్ చదివింది కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్మించినటువంటి మెడికల్ కాలేజీల ద్వారానేనని గుర్తు చేశారు. సంజయ్ కి అవగాహన లోకం ఎక్కువ అని కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఆయనకు కనిపించదని ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఎప్పుడూ చేస్తూనే ఉంటాడన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమైతుందని కల్వకుంట్ల కుటుంబానికి రాష్ట్రాన్ని దోచుకోవడం దాచుకోవడం సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కోరుట్ల పట్టణంలో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తుంటే బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన ఫిల్టర్ బెడ్ ను పూర్తిగా తొలగించిందన్నారు కోరుట్ల మెట్పల్లి మల్లాపూర్ ఇబ్రహీంపట్నం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ హయాంలో విద్యా వైద్యానికి పెద్ద పీట వేస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యావ్యవస్థను పూర్తిగా అన్యాయం చేసిందని 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ ని కూడా లేకపోవడం వల్ల అనేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జువ్వాడి కృష్ణారావు తోపాటు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఎ నయీమ్ కౌన్సిలర్లు చిట్యాల లక్ష్మినారాయణ, తోట గంగాధర్, రహీం, కో అప్షన్ సభ్యులు గుండోజీ శ్రీనివాస్, నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎడ్ల రమేష్, నేమురి భూమయ్య, సైదు గంగాధర్, వసిం, ఆర్ భూమయ్య, రియాజ్, ఏలిశెట్టి భూమరెడ్డి, లక్ష్మణ్, సదానంద చారి, లక్ష్మణ్, మహేష్, గంగాధర్, వాసిద్ ,సుమన్, మోహన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల్లో లింగ వివక్ష తొలగిపోయేది ఎప్పుడు!



ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. కాకపోతే కాస్త ఎక్కువ తక్కువల అంతే! అయితే వివక్షను అంతానికి పాలకులు ఎప్పటికప్పుడు ప్రతిన బూనుతూనే ఉన్నారు. కానీ ఫలితం ఏక్కడ? అన్ని రంగాలలోనూ వివక్ష కొనసాగుతూనే ఉంది. ..అంతే బలంగా. ప్రజల సంగతి పక్కన పెడితే.. మరి ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయ్! అవి చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన ఉండటం లేదు. ముఖ్యంగా వేతనాల విషయంలో తీవ్ర వివక్ష ప్రదర్శిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనమన్న సూత్రం అపహాస్యానికి గురవుతోంది. వేతనాల్లో లింగ వివక్షతో పాటు సామాజిక వివక్ష కొనసాగుతోంది. ఒకే పనిచేసే ఉన్నత కులస్తులకు, అదే పని చేసే దళిత కులాలకు మధ్య వేతనాల్లో వ్యత్యాసం ఉంటుండగా, అక్కడ కూడా పురుషుల కన్నా స్త్రీలకు తక్కువ వేతనం లభిస్తోంది. తక్కువ ఆదాయం వచ్చే పనుల్లో ఈ వివక్ష చాలా ఎక్కువగా ఉంటోంది. అజీమ్ ప్రేమ్ జీ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఎంఎ÷-లారుమెంట్ విభాగం దేశ వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం నిర్ధారణ అయింది. కులం ఆధారంగా, మతం ఆధారంగా ఈ వివక్ష కొనసాగుతుంది. అధిక జీతాలు పొందే ఉద్యోగాల్లో తప్ప మిగిలిన అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి పనుల్లోనూ మహిళలకు పురుషుల కన్నా తక్కువ వేతనాలు అందుతున్నాయి. బాగా చదువుకుని ఉన్నతస్థాయి ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు వేతనాల గురించి సంబంధిత యాజమాన్యాలతో బేరమాడే శక్తి ఎక్కువగా ఉందని, అందువల్లే ఉన్నతస్థాయిలో వివక్ష కనిపించడం లేదని ప్రేమ్‌జీ యూనివర్శిటీ చేసిన అధ్యయనాన్ని విశ్లేషించిన జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీలోని సెంటర్ ఫర్ న్యూ ఎకనమిక్స్ స్టడీస్‌లోని ఇన్ఫో స్పియర్ టీమ్ పేర్కొంది. ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం అధ్యయన నివేదిక, జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీ విశ్లేషణలు 'సామాజిక గుర్తింపు భారతదేశంలో ఇంకా కీలక పాత్ర పోషిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంలోనే కాదు. వేతనాల్లోనూ దీని ప్రభావం కనిపిస్తోంది. కొన్ని రకాల పనుల్లో కొన్ని సామాజిక వర్గాలే కనిపిస్తున్నాయి. ఆ పనుల్లో కూడా స్త్రీ, పురుష వివక్ష కనిపిస్తోంది.' అని పేర్కొన్నాయి. స్వయం ఉపాధి రంగంలో అవే పనులు చేసే పురుషుల కన్నా స్త్రీలకు 40 శాతం తక్కువ సంపాదన ఉందని ఈ సర్వేలో తేలింది. క్యాజువల్ వేజ్ ఉద్యోగాల్లో 64 శాతం, సాధారణ వేతన పనుల్లో 76శాతం ఈ వ్యత్యాసం కనిపిస్తోందని ఈ సర్వేలో తేలింది. అంటే రోజువారి వేతనాల ప్రాతిపదిక పొందే ఉపాధి పనుల్లో వివక్ష అధికంగా ఉంది. ప్రతి కులంలోనూ పురుషుల కన్నా మహిళలకు తక్కువ వేతనం లభిస్తోంది. సాధారణ వేతనాల్లో ఇలా...రెగ్యులర్ వేజ్ (సాధారణ వేతనాల) విభాగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు నెలకు 13,735 రూపాయలు వేతనం లభిస్తుండగా, ఇతరులకు 18,005 రూపాయలు వేతనం లభిస్తోంది. ఈ విభాగంలో హిందువులకు 17,197 రూపాయలు నెలకు సగటున లభిస్తుండగా, ముస్లింలకు 13,550 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి. మొత్తంమీద పురుషులకు 17,910 రూపాయలు సగటు వేతనం లభిస్తుండగా, స్త్రీలకు 13,666 రూపాయలు దక్కుతున్నాయి. స్వయం ఉపాధి రంగంలో ...సొంతంగా ఏదోఒక పనిచేసుకుని పొట్టపోసుకునే వారి సంపాదనలోనూ అంతరాలు ఉన్నాయి. ఒకే రకమైన పనిచేస్తున్నా ఎస్‌సి, ఎస్‌టిలకు 8,271 రూపాయలు నెలకు లభిస్తుండ గా, ఇతరులు 11,539 రూపాయలు సంపాదిస్తున్నారు. హిందువులకు సగటున 10,663 రూపాయలు లభిస్తుండగా, ముస్లింలకు 10,395 రూపాయలు మాత్రమే లభిస్తోంది. ఈ విభాగంలో పురుషులతో పోలిస్తే మహిళల సంపాదన చాలా తక్కువగా ఉంది. పురుషులు సగటున 12,099 రూపాయలు సంపాది స్తుండగా, మహిళలకు కేవలం 4,809 రూపాయలు మాత్రమే దక్కుతున్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. చిన్న వ్యాపారులు చేసుకునే మహిళలు అధిక వివక్షకు గురికావాల్సివస్తోంది. వీరికి రుణాలు లభించడం కూడా కష్టమవుతుంది. కుల,మతాలకు అతీతంగా మహిళల పట్ల ఈ వివక్ష కొసాగుతోంది.క్యాజువల్ వేతనాల్లో ...క్యాజువల్ వేతనాల విభాగంలో ఎస్‌సి,ఎస్‌టిలకు రోజుకు సగటున 309 రూపాయల వేతనం లభిస్తుండగా, ఇతరులకు 344 రూపాయలు లభిస్తుంది. మొత్తంమీద పురుషులకు 358 రూపాయలు వేతనం వస్తుండగా. స్త్రీలకు 230 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి. ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నప్పటికీ మహిళలు పురుషుల కన్నా కొంత వెనుకబాటుకు గురై ఉన్నారని ఈ అధ్యయనం పేర్కొంది. తరతరాలుగా సమాజంలో పేర్కొన్న భావజాలం దీనికి కారణమని నిర్ధారించింది. మూడవ, నాల్గవ దశకంలో ముస్లింల సంపాదన హిందువుల సంపాదనలో 94 శాతంగా ఉండేదని ప్రస్తుతం అది 74 శాతానికి పడిపోయిందని నివేదిక తెలిపింది. కొన్ని పనుల్లో ముస్లింలు హిందువుల కన్నా ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్నప్పటికీ వెనుకబాటుతనం మాత్రం ముస్లింలలోనే అధికంగా ఉందని నివేదిక పేర్కొంది. హిందు, ముస్లిం కార్మికుల మధ్య పెరుగుతున్న ఈ అంతరం ఆందోళన కరంగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు ఈ వాస్తవాలను గుర్తించి ప్రభుత్వాలు చిత్త శుద్ధితో వ్యవహరించాల్సి వుంది.

**మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన**

# కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి



**నాగారం, జూన్ 26 :**

మాదకద్రవ్యాల నిర్మూలన పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ ఐ చిరంజీవి అన్నారు. శుక్రవారం నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా లో మాదక ద్రవ్యాల నిర్మూలన లో ప్రతి ఒక్కరు భాగస్వాముయ్యలు కావాలని అన్నారు. మాదకద్రవ్యాలను చాక్లెట్లో పౌడర్ల రూపంలో సరఫరా చేస్తున్నారని బస్సులో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు జాగ్రత్త వహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీర సోములు కానిస్టేబుల్ శ్రీనివాస్ హోమ్ గార్డ్స్ యువరాజ్ హరికృష్ణ గ్రామస్తులు ప్రయాణికులు పాల్గొన్నారు.

# అంకితభావానికి అగ్రతాంబూలం

**సంతోష్ బాబుకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు**

**వేములవాడ, జూన్ 26**



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన మాజీ కౌన్సిలర్, పార్టీ సీనియర్ నాయ కుడు రేగుల సంతోష్ బాబును పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. పార్టీ కోసం దీర్ఘకాలంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ సంస్థాగత బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం పార్టీ ఆయన సేవల కు ఇచ్చిన గుర్తింపుగా నాయకులు పేర్కొ న్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచం దర్ రావు సూచనల మేరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులను ప్రకటిం చారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా రేగుల సంతోష్ బాబును నియమిం చారు.ఈ సందర్భంగా సంతోష్ బాబు మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయక త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఓబీసీ మోర్చాను గ్రామస్థాయి వరకు విస్తరించడంతో పాటు పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తానని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడమే కాకుండా ఓబీసీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజ య్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రేగుల సంతోష్‌బాబు నియామకాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిం చాయి. ఆయన నాయకత్వంలో జిల్లాలో బీజేపీ ఓబీసీ మోర్చా కార్యకలా పాలు మరింత వేగం పుంజుకుంటాయని నాయకులు, ఆశాభావం వ్యక్తం చేశారు.

# మొక్కుబడిగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం !

ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నా కారణాలను గుర్తించి నివారణ చర్యలను పట్టించుకోవడం లేదు. ఇంతకన్నా దారుణం మరోటి కాదు. సుప్రం మొట్టికాయలు వేస్తున్నా పట్టింపు లేకుండా పోయింది. పాలకుల నిర్లక్ష్యానికి ఇంతకన్నా నిదర్శనం లేదు. మనది వ్యవసాయిక దేశం..వ్యవసాయమే మన ప్రధాన వనరు. మనకున్న భూమి, నీటి వసతులు ఎంతో విలువైనవి, సారవంతమైన నేలలు, సహజ జలవనరులు మనసొంతం. భారతదేశం అనాదినుంచి వ్యవసా యన్ని ఆధారంగా చేసుకుని ముందుకు సాగుతోంది. వ్యయసాయాన్ని నమ్ముకున్న మనం.. వ్యవ సాయాధారిత రంగాలనే ఎంచుకోవాలి. మానవులను కబళించే..ఆరోగ్యాన్ని హరించే పరిశ్రమల జోలిక వెళ్లకుండా ప్రజలు చైతన్యం కావాలి. పరిశ్రమలను కొనితెచ్చుకుని అనారోగ్యం తో జీవించడం అసవరమా అని ఆలోచించాలి. విషతుల్య పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడాలి.అవసరమైతే వాటిని మూసివేయించాలి. కేవలం వ్యవసాయంతో పాటు,అనుబంధ రంగాలకు మాత్రమే ప్రోత్సాహం ఇచ్చుకునేలా చూడాలి. లేకుంటే మన వనరులు కలుషితం కాగలవు. ఇప్పటికే మన నదులు కలుషితం అవుతున్నాయి. దేశంలో కాలుష్యం పెరగకుండా, కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటే తప్ప మనుగడ సాధ్యం కాదు. అయితే మధ్యలో వచ్చిన పాలకులు కక్కుర్తిపడిన ఖర్మానికి ప్రజలు కష్టాలు, నష్టాలు అనుభవించాల్సి వస్తోంది. దేశ జనాభా పెరుగుతున్నా మనకు సరైన పౌష్టికాహారం నేటికీ అదండం లేదు. ఈ క్రమంలో మనమంతా చైతన్య వంతులం అయ్యి మన సహజ వనరులు కలుషితం కాకుండా కాపాడు కోవాల్సి ఉంది. కొండలుగుట్టలను కాపాడు కోవాలి. అడవుల ను రక్షించుకోవాలి. అడవులను, కొండలను నరకడం కూడా పర్యావరణ విధ్వంసం కిందకే వస్తుంది. కాకినాడ తీరంలో మడ అడవులను నరకడంతో ఎన్నో దుష్ఫలితాలు ఎదుర్కొంటున్నాం. మట్టి కలుషితం అయినా, నీరు కలిషితం అయినా మన జీవన మనుగడ ప్రశ్నార్థకం కాగలదు. అయితే ప్రభుత్వాలు ఇబ్బడిముబ్బడి గా కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు అనుమ తులు ఇవ్వడం వల్ల మన నీను, భూమి కలుషితం అవుతోంది. పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకొవటమే కాకుండా మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల,జీవాధారమైన నీరు కాలుష్యమౌతుంది.




## నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## వ్యూస్ కోసం దిగజారొద్దు..

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.



## అవన్నీ రూమర్లే!



అచ్చ తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు. ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## ఇక తమిళం వంతు!

దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే.

ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట.

త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.

